నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శనివారం 12 ఏప్రిల్ 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

కృష్ణానది నీళ్లను కొల్లగొట్టే చర్యలు

- కండ్లు మూసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- పాలమూరు, నల్లగొండ జిల్లాలకు నీటి కష్టాలే..
- ట్రిబునల్ తీర్పు వెలువడేదాకా కొత్త పనులు ఆపాలి
- పాలమూరు ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కార్ కక్ష
- రేవంత్ రెడ్డి చర్యలతో అంతర్మథనంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఏప్రిల్ 11(నమస్తే తెలంగాణ) : ఏపీ ప్రభుత్వం శ్రీశైలం ప్రధాన ఎడమ కాల్వ ద్వారా అదనపు నీళ్లను తీసుకెళ్లే విధంగా చర్యలు చేపడుతున్నా.. ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లు మూసుకున్నదని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఏపీ ప్రభుత్వ చర్యలతో వచ్చే రోజుల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు కృష్ణానది నీళ్ల సమస్య ఉత్పన్నం అవుతుందని సింగిరెడ్డి చెప్పారు. రెండు రాష్ట్రాల కృష్ణా నదీజలాల వినియోగంపై బ్రిజేష్‌కుమార్ ట్రిబునల్ తీర్పు వెలువడే వరకు ఏపీ ప్రభుత్వం ఎలాంటి కొత్త పనులను చేపట్టరాదని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీశైలం ఎడమ కాల్వలో ప్రస్తుతం 50 వేల క్యూసెక్కుల నీరు వెళ్లే సామర్థ్యం ఉందని, ఇదే కాల్వను 90 వేల క్యూసెక్కుల నీటిని తరలించేలా ఏపీ ప్రభుత్వం ఆధునీకరిస్తుందన్నారు. ఇంత దుర్మార్గం జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం అడ్డుకట్ట వేసే ప్రయ త్నం చేయడం లేదని, గతంలో వైఎస్ఆర్ ఉన్నప్పుడే ఈ పనులను మొదలు పెడతామంటే.. కేసీఆర్ అప్పట్లో అడ్డుకోవడంతో నిలిచిపోయిందన్నారు. ఈ చర్యల వల్ల కృష్ణా నదిలో నీటి శాతం తగ్గిపోతుందని, తద్వారా తెలంగాణలోని కృష్ణానదిపై ఆధారపడ్డ జిల్లాలకు తీవ్ర సాగునీటి సమస్యలు తలెత్తుతాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నందుకు ప్రజలకు కాంగ్రెస్ వేస్తున్న సాగునీటి శిక్షగా నిరంజన్‌రెడ్డి అభివర్ణించారు. ఏపీ ప్రభుత్వ చర్యలతో శ్రీశైలంపై ఉన్న తెలంగాణ జల విద్యుత్‌పైన కూడా ప్రభావం పడుతుందని, రెండు రాష్ట్రాల మధ్య నదుల నీటిపై చట్టబద్ధత తాత్కాలికంగానే కొనసాగుతుందన్నారు. త్వరలోనే బ్రిజేశ్‌కుమార్ ట్రిబునల్ తీర్పు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో ఏపీ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులకు తీవ్ర నష్టం కలిగించే చర్యలకు పూనుకున్నదన్నారు. ఏ ప్రాంత రైతులకైనా సాగునీరు అందించే చర్యలకు తాము వ్యతిరేకం కాదని, చట్టబద్ధత లేకుండా అడ్డదారుల్లో చేసే ప్రయత్నాలకే తాము వ్యతిరేకమన్నారు. కృష్ణానది నుంచి అత్యధిక నీరు తీసుకెళ్లాలని పనులను చేపట్టిన శ్రీశైలం ఎడమ కాల్వ లైనింగ్ పనులను వెంటనే ఆపాలని, ఏపీ బలబడటం కోసం తెలంగాణకు అన్యాయం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని, కేవలం గత ప్రభుత్వంపై తూలనాడుకుంటూనే కాలం గడుపుతామంటే కుదరదన్నారు. కృష్ణానది నీటి వినియోగంపై ట్రిబునల్ తీర్పు వచ్చే వరకు శ్రీశైలం ఎడమ కాల్వ ఆధునీకరణ పనులను నిలిపి వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కక్షతోనే పాలమూరు ప్రాజెక్టు పక్కకు..

90 శాతం పనులను పూర్తి చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కక్ష పూరితంగా పక్కకు పెట్టిందని నిరంజన్ రెడ్డి విమర్శించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి జిల్లాలో 12 లక్షల ఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉన్నా మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదన్నారు. మిగిలిన పనులు పూర్తి చేసి సాగునీరందిస్తే.. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న కుట్రతోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం లేదని విమర్శించారు. సీఎం సొంత జిల్లాలోని ప్రాజెక్టును ఇలా ఎండబెట్టి.. నల్లగొండకు సాగునీరు తీసుకెళ్లేందుకు ఏడుల రిజర్వాయర్ నుంచి అత్యధిక ఖర్చును చేస్తూ రూ.1800 కోట్లతో మొదటి దశ టెండరును పూర్తి చేసి సీఎం బావమరిదికి నజరానాగా కాంట్రాక్టును కట్టబెట్టారని ఆరోపించారు. వట్టెం రిజర్వాయర్ నుంచి కేవలం 100 కోట్లతో డిండికి సాగునీరిందించే అవకాశం ఉన్నా.. ఇక్కడి రైతులకు సాగు నీటి ఇబ్బంది కల్గించేలా ఏడుల నుంచి డిజైన్ చేశారన్నారు. ఈ ప్రాజెక్టు గుత్తేదారులకు లాభం.. రైతులకు నష్టం అన్న చందాన రూపకల్పన జరిగిందని, నల్లగొండకు సాగునీటిని అందించే క్రమంలో పాలమూరు ప్రజల జీవితాలతో ఆటలాడవద్దని సింగిరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పిదాల వల్ల కేంద్ర కాంగ్రెస్ అధిష్టానం అంతర్మథనంలో పడిపోయిందన్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ సైతం రేవంత్ రెడ్డి ప్రభుత్వ చర్యలపై డిఫెన్స్‌లో పడ్డారని, దేశంలో కాంగ్రెస్ కోలుకోలేని పరిస్థితికి చేరుకున్నదన్నారు. ఇటీవలి హెచ్‌సీయూ ఘటనతోపాటు అంతకుముందు వరుసగా చేస్తున్న తప్పిదాలే రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనూ కాంగ్రెస్‌ను దిగజార్చాయని గుర్తు చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, గులాం ఖాధర్, కురుమూర్తియాదవ్, నందిమళ్ల అశోక్, నాగన్న యాదవ్, జోయబ్ తదితరులు పాల్గొన్నారు

బడుగుల ఆశా జ్యోతి జ్యోతిబా పూలే



జ్యోతిబాపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 11 : అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన బడుగుల ఆశా జ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా ఉండవెల్లి మండల అలంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే విజయుడు, బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు కిశక్షర్ ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పూలే సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త మానవతావాది అని అన్నారు. చదువు లేనిదే జ్ఞానం లేదని సత్యాన్ని గ్రహించి పూలే తన భార్య సావిత్రీబాయి పూలేతో కలిసి దేశంలోనే మొదటిసారిగా1848లో పూణేలో బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించిన మహనీయుడు జ్యోతిబా పూలే అని అన్నారు. కార్యక్రమంలో రఘురెడ్డి, గోపాల్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

- నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ చేపట్టిన పీయూటీఏ నాయకులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 11 : రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని పాలమూరు యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీ పరిపాలన భవనం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం అడ్మిన్ నుంచి ఫార్మసీ కాలేజ్ వరకు ర్యాలీ నిర్వహించి మహనీయుల జయంతి ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీయూటీఏ నాయకుడు భూమయ్య మాట్లాడుతూ కాంట్రాక్ట్ అధ్యాపకులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే త్వరలో సమ్మెకు వెళ్లి, యూనివర్సిటీలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు.

నిరసన ర్యాలీ చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు

కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, పర్వతాలు, రవికుమార్, సుదర్శన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శివకుమార్‌సింగ్, జిమ్మికార్టన్, శిలాస్,వెంకటేశ్, జ్ఞానేశ్వర్, స్వాతి, ఆయేషా పాల్గొన్నారు.

సలేశ్వరం జాతర ప్రారంభం

లింగమయ్య స్వామి దర్శనానికి వస్తున్న భక్తులు

అచ్చంపేట, ఏప్రిల్ 11 : వస్తున్నాం..వస్తున్నాం.. లింగమయ్య అంటూ భక్తుల నామస్మరణ మధ్య నల్లమల గిరులు పులకించాయి. చైత్ర పౌర్ణమి సందర్భంగా శుక్రవారం నుంచి సలేశ్వరం లింగమయ్య జాతర ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు (ఈనెల 11,12,13) కొనసాగనున్న ఈ జాతరకు మొదటి రోజే భక్తులు వేలాదిగా తరలివచ్చారు. సలేశ్వరం లింగమయ్య స్వామిని దర్శించుకునేందుకు నేపాల్ నుంచి నాగసాధువు శివనాగబాబా వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. జాతరలో చెంచులు సంప్రదాయ పూజారులుగా వ్యవహరిస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

రజతోత్సవ సభను

విజయవంతం చేద్దాం

- తెలంగాణను అగ్రభాగాన నిలిపింది కేసీఆరే..
- సాగు, తాగునీరు అందించి సమగ్ర అభివృద్ధికి కృషి చేశాం
- స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకుందాం
- వరంగల్‌కు భారీగా తరలిరావాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపు
- ఖిల్లాఘణపురం, పెద్దమందడిలో సన్నాహక సమావేశం

ఖిల్లాఘణపురం/ పెద్దమందడి, ఏప్రిల్ 11 : ఈ నెల 27న వరంగల్‌లో జరిగే భారీ బహిరంగ సభకు ఖిల్లాఘణపురం, పెద్దమందడి మండలాల నుంచి భారీగా కార్యకర్తలు తరలివచ్చి సభను సక్సెస్ చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రజతోత్సవ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పూలే జయంతి సందర్భంగా ఆయన జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి రోజూ సమావేశాలు ఏర్పాటు చేసుకొని కార్యకర్తలను తరలించే విధంగా నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్రా నాయకుల బానిసత్వం నుంచి తెలంగాణను విముక్తి చేసి అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపిన ఘనత కేసీఆర్‌దేనని, నియోజకవర్గంలో విద్య, వైద్యం, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, తాగునీరు, సాగునీరు, సమగ్ర అభివృద్ధి ఎంతో కృషి చేశామన్నారు. ప్రజల కష్ట సుఖాల వెంట ఉండే బీఆర్ఎస్ అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించి కేసీఆర్‌కు అండగా నిలవాలన్నారు. గణప సముద్రంలో ఏడాది పొడవునా నీళ్లు ఉండేవిధంగా కేఎల్ఐ ప్రధాన కాల్వ నుంచి నీళ్లు మళ్లించి సస్యశ్యామలం చేశామన్నారు. 25వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేశామన్నారు. దీంతో పాటు వట్టెం రిజర్వాయర్ నుంచి కూడా సాగునీరు అందించేందుకు గొప్ప ప్రణాళికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. గణప సముద్రం రైతులకు ఎలాంటి కష్టం కలుగకుండా ముగ్గురు చీఫ్ ఇంజినీర్లతో కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీ నివేదిక ద్వారానే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఎన్నోమార్లు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి రూ.50కోట్లు మంజూరు చేయించానని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలోని మండలంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ముందు వరుసలో ఉంచిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని ఆయన గుర్తుచేశారు. అలాగే పెద్దమందడి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రజతోత్సవ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పల్లె పల్లె నుంచి పండుగ వాతావరణంలో రజతోత్సవ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ కోసం పనిచేసే నాయకులను , కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేణు, మాజీ ఎంపీపీ మన్నెపు రెడ్డి, దయాకర్, మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కుమార్ యాదవ్, విజయ్‌కుమార్, నందిమళ్ల అశోక్, కృష్ణ నాయక్, రాళ్లకృష్ణయ్య, సామ్యనాయక్, జాత్రునాయక్, బాలీశ్వర్‌రెడ్డి, పురేందర్‌రెడ్డి, వెంకటరమణ, రంగారెడ్డి, ఆంజనేయులుగౌడ్, నాగేంద్రం, సేనాపతి, కురుమూర్తి గ్రామస్తులు పాల్గొన్నారు.

పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి

సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు



మద్దూర్‌లో జ్యోతిబాపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

పండుగలా జరుపుకొందాం

- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూర్, ఏప్రిల్11 : ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పండుగలా జరుపుకొందామని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మద్దూర్ పట్టణంలోని షా గార్డెన్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా మద్దూర్, కొత్తపల్లి, గుండుమాల్, మండలాల బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ముందుగా జ్యోతి బా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీదే విజయమన్నారు. దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అని అన్నారు. కార్యక్రమంలో మద్దూర్, కొత్తపల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంచర్ల గోపాల్, మధుసూదన్‌రెడ్డి, నాయకులు శాసం రామకృష్ణ, సలీం, వీరారెడ్డి, శేఖర్, మ్యతరి మహేందర్ ఉన్నారు.

సభకు భారీగా తరలిరావాలి

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- కొల్లాపూర్‌లో కార్యకర్తలతో సన్నాహక సమావేశం

కొల్లాపూర్ రూరల్, ఏప్రిల్ 11 : వరంగల్ నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు , ప్రజలు స్వచ్ఛందంగా భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కొల్లాపూర్ పట్టణంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే బీరం హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. అనంతరం కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.అనంతరం కార్యాలయం నుంచి కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీగా జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో పాల్గొని పూలే చేసిన సేవలు కొనియాడారు. బీఆర్ఎస్ పట్టణ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున మాజీ ఎమ్మెల్యే వెంట బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

మధ్యాహ్న భోజనంలో నీళ్ల చారు

గట్టు ప్రాథమిక పాఠశాలలో నీళ్ల చారును చూపిస్తున్న విద్యార్థినులు

- ఇబ్బందులు పడిన విద్యార్థులు

గట్టు, ఏప్రిల్ 11 : మండలకేంద్రంలోని బాలుర, బాలికల ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినలేక విద్యార్థులు శుక్రవారం అవస్థలు పడ్డారు. అన్నంతోపాటు ఉడికి ఉడకని టమాటతో కూడిన నీళ్ల చారును విద్యార్థులకు వడ్డించారు. ఈ నీళ్ల చారుతో అన్నం తినలేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. రుచి, శుచి లేని ఈ భోజనాన్ని విద్యార్థుల తినలేక పారబోశారు. గత కొన్ని నెలలుగా తమకు బిల్లు రాకపోవడంతో ఈవిధంగా వండినట్లు ఏజెన్సీ వారు చెబుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లగా ఇదొక్కసారికి వదిలేయండి సార్. మళ్లీ ఇలా జరగకుండా చూస్తామని చెప్పారని స్థానికులు చెబుతున్నారు. కాగా ఈ విషయంలో చొరవ తీసుకుని మధ్యాహ్న భోజనం నాణ్యతగా వండేటట్లు చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రామకృష్ణది హత్యా.. ఆత్మహత్యా?

- మితిమీరిన ట్రాన్స్‌జెండర్స్ ఆగడాలు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

మల్దకల్,ఏప్రిల్ 11 : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఇటీవల ట్రాన్స్ జెండర్ చేతిలో ఆటో డ్రైవర్ మృతిచెందిన సంగతి మరవక ముందే మళ్లీ ట్రాన్స్ జెండర్ చేతిలో మరొకరు బలి అయిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. గ్రామానికి కొత్త కుర్వ రామకృష్ణను ట్రాన్స్ జెండర్లు హత మార్చి దానిని ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నించిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం మేరకు గ్రామానికి చెందిన కుర్వ రామకృష్ణ (24) గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన శివాణి అనే ట్రాన్స్ జెండర్‌తో రెండేండ్లుగా కలిసిమెలిసి తిరుగుతుండేవారన్నారు. కాని ఇటీవల కొద్ది రోజులుగా రామకృష్ణ ట్రాన్స్‌జెండర్ శివాణి ఫోన్ చేసిన లిఫ్ట్ చేయకపోవడంతో రగిలిపోయిన శివాణి మరో ముగ్గురితో కలిసి శుక్రవారం ఉదయం మల్దకల్ గ్రామానికి చేరుకున్నారు. రామకృష్ణ భార్య, కుటుంబ సభ్యులు ఓ పెండ్లి వెళ్లగా రామకృష్ణ ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. ఈ సమయంలో ట్రాన్స్ జెండర్ శివాణితో పాటు వచ్చిన మరో ముగ్గురు ట్రాన్స్ జెండర్లు ఇంట్లోకి ప్రవేశించి తలుపులు మూసి యువకుడి నోట్లో బట్టలు కుక్కి అతడిపై విచక్షణ రహితంగా దాడి చేసి గొంతు నులమడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడన్నారు. దీంతో వారు రామకృష్ణను జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వ దవాఖాన తరలించి అక్కడి నుంచి ట్రాన్స్‌జెండర్లు పరారైనట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

ట్రాన్స్ జెండర్ల నిర్వాకంతో తమ కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయామని తమకు దిక్కెవరని రామకృష్ణ భార్య కృష్ణవేణితోపాటు కుమారులు, బంధువుల ప్రభుత్వ దవాఖాన వద్ద ఆందోళన చేపట్టారు. రామకృష్ణ ఉరేసుకుంటే తమ ఇంట్లోనే శవం ఉండాలని గద్వాల దవాఖానకు ఎవరు తరలించారని ప్రశ్నించారు. కుటుంబ సభ్యులు లేనిదే శవం ఇక్కడకి ఎలా వచ్చిందన్నారు. రామకృష్ణను ట్రాన్స్‌జెండర్లు చంపి ఇక్కడికి తెచ్చారని ఆరోపించారు. తమకు న్యాయం జరగాలంటే ట్రాన్స్‌జెండర్లు తమ ముందుకు రావాలని వారు వచ్చే వరకు పోస్టుమార్టం నిర్వహించొద్దని అడ్డుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ పూజయ్య వివరాల మేరకు రామకృష్ణది అనుమానాదస్పద మృతి కింద కేసు నమోదు చేశామన్నారు. భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. దవాఖానకు వెళ్లి చూడగా గొంతుపై నల్లని గాట్లు ఉన్నాయన్నారు. హిజ్రా శివాణి మరో ముగ్గురు హిజ్రాలు తనభర్తను చంపివేశారని ఆనుమానం ఉందని ఫిర్యాదు చేసిందన్నారు.

పట్టపగలే చిరుతల సంచారం

యన్మన్‌గండ్ల ద్యావరగుట్ట గుండ్లపై కూర్చున్న చిరుత

- యన్మన్‌గండ్ల ద్యావరగుట్టపై దర్శనం
- భయాందోళనలో గ్రామస్తులు

నవాబ్‌పేట, ఏప్రిల్11 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం యన్మన్‌గండ్ల గ్రామ శివారులోని ద్యావర గుట్టపై పట్టపగలే రెండు చిరుతలు సంచరించడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని యన్మన్‌గండ్ల గ్రామానికి కూత వేటు దూరంలోనే ద్యావర గుట్ట ఉంటుంది. అక్కడ గుట్టపై శుక్రవారం సాయంత్రం వ్యవసాయ పొలాల వద్ద గ్రామస్తులకు రెండు చిరుతలు కనిపించాయి. వీటిని చూసిన ప్రజలు గ్రామంలోని వారికి సమాచారం చేరవేయడంతో గ్రామస్తులంతా అక్కడికి చేరుకొని దూరం నుంచి వాటిని చూసి భయాందోళనకు గురయ్యారు. అటవీ శాఖ అధికారులు స్పందించి జనావాసాల్లో సంచరిస్తున్న చిరుతలపై దృష్టి సారించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని

రూ.3.5 లక్షలు స్వాహా

- కేసు నమోదు

నవాబ్‌పేట, ఏప్రిల్ 11 : నవాబ్‌పేట మండలంలోని దాయపంతులపల్లి గ్రామానికి చెందిన వడ్ల రాఘవేందర్ అనే యువకుడికి ముగ్గురు వ్యక్తులు కలిసి ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసి డబ్బులు స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై విక్రమ్ కథనం మేరకు గ్రామానికి చెందిన రాఘవేందర్‌కు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి..మరికల్ గ్రామానికి చెందిన సీఆర్టీ ఉపాధ్యాయుడు నీలి ప్రసాద్, అతడి సోదరుడు ఆర్ఎంపీ వెంకటేశ్ మాయ మాటలు చెప్పి కొంతకాలం కిందట రూ.3.50లక్షలు తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. రాఘవేందర్‌తో డబ్బులు తీసుకొని వికారాబాద్‌కు చెందిన వీరమణితో చేతులు కలిపి అక్కడా..ఇక్కడా ఉద్యోగం ఇస్తామని చెప్పి మోసం చేసినట్లు తెలిపారు. ఉద్యోగం ఇవ్వక పోవడమే కాకుండా రాఘవేందర్ ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే కొంతకాలంగా అతడిని వేధించి తీవ్ర మానసిక క్షోభకు గురి చేశారని వివరించారు. రాఘవేందర్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.